గుర్తు తెలియని వ్యక్తి మృతి

బౌద్ధనగర్: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వారాసీగూడ జామై ఉస్మానియా సమీపంలోని వర్ష సర్వీసింగ్ సెంటర్ వద్ద శుక్రవారం సమారు 30- 35 వయసున్న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న నగదు, బంగారం స్వాధీనం

అమీర్‌పేట: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న నగదుతో పాటు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా యాక్టీవా వాహనంపై హాఫీజ్‌పేట నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న మహేంద్రకుమార్ అనే వ్యాపారిని ఆపి తనిఖీ చేయగా రూ.5.80 లక్షల నగదు, రూ.3,86,640 విలువ చేసే బంగారు, రూ.1,12,245ల విలువ గల వెండి ఆభరణాలను గుర్తించారు. వాటికి సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం


హనుమంతరావు

బౌద్ధనగర్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన వారసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్శీగుట్టలోని ఎంసీహెచ్ కాలనీకి చెందిన ఎస్‌టీకే హనుమంతరావు ప్రైవేటు ఉద్యోగి. ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ భూములు పరిరక్షిస్తాం.. మెరుగైన సేవలందిస్తాం

- సకాలంలో సమస్యల పరిష్కారం
- ప్రజా సేవల్లో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించం
- సాక్షితో సికింద్రాబాద్ నూతన ఆర్డీఓ దశరథ్ సింగ్ రాథోడ్



బన్సీలాల్‌పేట్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు..అభివృద్ధి కార్యక్రమాలు అర్హులంతా సద్వినియోగం చేసుకునేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భూముల పరిరక్షణకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతూ కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తూ కోట్లాది రూపాయల విలువైన భూములను స్వాధీనం చేసుకుంటున్నామని సికింద్రాబాద్ నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన దశరథ్ సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా రెవెన్యూ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పని చేసిన దశరథ్ సింగ్ రాథోడ్ బదిలీపై సికింద్రాబాద్ ఆర్డీఓగా వచ్చారు. ఇక్కడ పని చేసిన రవి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగానికి బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన దశరథ్ సింగ్ రాథోడ్ సాక్షి ముఖాముఖిలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ కార్యకలాపాల గురించి..

ఆర్డీఓ: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సికింద్రాబాద్, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, అమీర్‌పేట్, షేక్‌పేట్, ఖైరతాబాద్, ముషీరాబాద్ మండలాలు ఉన్నాయి. ఆయా మండల కార్యాలయాల ద్వారా రెవెన్యూ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా పేదలకు పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అందించడంతో పాటు కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేస్తున్నాం.

ప్రశ్న: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్డీఓ: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ కార్యచరణలో ముందుకు సాగుతాం. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే కబ్జాకు గురైన భూముల విషయంలో న్యాయ పోరాటం చేసి వాటిని స్వాధీనం చేసుకుంటున్నాం. మండలాల వారీగా ప్రభుత్వ భూములను గుర్తించి అక్కడ బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: చాలా బస్తీల్లో 'డబుల్' ఇళ్ల మంజూరు కాక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఆర్డీఓ: సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అనేక అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బస్తీల్లో డబుల్ బెడ్రూమ్‌లు నిర్మించడం జరిగింది. చాలా వరకు లబ్ధిదారులకు అలాట్‌మెంట్ చేయడం జరిగింది. అక్కడక్కడ కొన్ని సమస్యల కారణంగా అలాట్‌మెంట్ ఇవ్వలేకపోయాం. అయితే సరైన పత్రాలు ,ఆధారాలతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది విచారణ చేపట్టి అందజేస్తాం.

ప్రశ్న: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల గురించి ..

ఆర్డీఓ: ప్రభుత్వం తరపున కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నాం. ఈ పథకం ద్వారా పేదింటి ఆడపడుచులకు రూ.1.16లక్షలు అందజేయడం జరుగుతుంది. అర్హులైన పేదలకు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే 30 నుంచి 90 రోజుల్లో ఆర్థిక సాయం అందుతోంది.



ప్రశ్న: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం గురించి..

ఆర్డీఓ: ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ పరమైన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 4గంటల మధ్య ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తున్నాం. సకాలంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే విధంగా తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. సేవల్లో ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రెవెన్యూ సేవల్లో దళారి వ్యవస్థ నిర్మూలనకు తీసుకునే చర్యలు ఏమిటి..?

ఆర్డీఓ: రెవెన్యూ పరమైన సేవల్లో దళారిరీ వ్యవస్థకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలు నేరుగా వచ్చి ఆయా పథకాలు, సేవల కోసం దరఖాస్తు చేసుకుంటే చర్యలు చేపడుతాం. సేవల్లో జాప్యం లేకుండా ఇప్పటికే ఆయా మండలాల పరిధిలోని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. దళారుల మాటలు నమ్మవద్దు. నేరుగా అధికారుల వద్దకు వచ్చి పనులు చేయించుకోవాలి.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 25, క్యారెట్ 33, దొండ 25, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 32, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 45, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: యువత స్వయం ఉపాధి ఏర్పరచుకుని ఆర్థికంగా ఎదిగి మరి కొంతమందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ నేత వెల్లాల రామ్మోహన్ పిలుపునిచ్చారు. సనత్‌నగర్ ప్రధాన రహదారిలోని మసీదు వద్ద పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకోవడం కోసం మహ్మద్ రియాజుద్దీన్‌కు ఆదివారం ఆయన కార్యాలయంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ.. నిరుపేదలు తమ కాళ్లపై తాము నిలబడి మరి కొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు.

నియామకం


సాయ దత్తు

బౌద్ధనగర్: బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్‌గా సాయ దత్తు నియమిస్తూ ఆ పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం అయ్యేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. యువత పార్టీకి మరింత దగ్గరయ్యేలా కేంద్రం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వారి ముందుకు తీసుకెళ్తానన్నారు. తనకు సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్, సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డికి ధన్యవాదాలు అన్నారు.

ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా సతీష్‌రాజ్..


నియామక పత్రం అందుకుంటున్న సతీష్‌రాజ్

సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా వీరబోయిన సతీష్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్ నియామకపు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు సహకరించిన కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డితో పాటు డివిజన్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు.

నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి

సనత్‌నగర్: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన ఇవ్వనున్నట్లు సొసైటీ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ (సెడ్) ప్రతినిధి క్రాంతి వెలగపూడి ఒక ప్రకటనలో తెలిపారు. 18–25 సంవత్సరాల వయస్సు కలిగి ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారికి నాలుగు నెలల పాటు నర్సింగ్ కోర్సులో శిక్షణ ఉంటుందన్నారు.శిక్షణ అనంతరం ఆరు నెలల పాటు ఉద్యోగం కూడా చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, మూడు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 14, మరిన్ని వివరాలకు ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కన సాహితి ఆర్కేడ్ ఆరో అంతస్తులోని సెడ్ కార్యాలయం లేదా 99490 71079, 94954 54999 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

సనత్‌నగర్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగు వస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. వెంగళరావునగర్ బస్తీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు పోరాటాల రాములు మాదిగ అధ్యక్షతన జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గం మాదిగ, ఉపకులాల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేకపోవడంతో విద్యా ఉద్యోగాల్లో మాదిగలకు రావాల్సినంత అవకాశాలు రాలేకపోయాయన్నారు. 70 ఏళ్ల ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు నూటికి తొంభై శాతం మాలలకే దక్కాయన్నారు. 30 ఏళ్ల ఉద్యమాన్ని గుర్తించి ప్రధాని మోదీ మాదిగల కోసం హైదరాబాద్ సభకు వచ్చి ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. చివరి దశకు రావడానికి కేంద్ర ప్రభుత్వానికి, మాదిగ జాతికి మధ్య వారధిగా ఉంటూ ఎనలేని కృషి చేసిన వ్యక్తి కిషన్‌రెడ్డి అన్నారు. అందుకే కొంతమంది మాల స్వార్థపరులు కిషన్‌రెడ్డిని ఓడించాలని సికింద్రాబాద్ పార్లమెంట్‌లో తిరుగుతున్నారని ఆరోపించారు. కేవలం మాదిగల ఓట్ల కోసమే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కపట నాటకాలు ఆడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్‌మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ సీనియర్ నేత రాగటి సత్యం, జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహ, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మేకల శ్యామ్‌మాదిగ, నేతలు వాసుదేవ్ మాదిగ, వెంకటేష్‌మాదిగ, నారాయణ, సరోజన, స్వప్న, సుదర్శన్ మాదిగ, డప్పు రమేష్, గిరిమాదిగ, బస్తీ పెద్దలు గాలయ్య, నరసింహా, ప్రభాకర్, మురళి, శంకర్, వెంకటేష్, భీమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీజేపీకి అండగా నిలువాలి..

సికింద్రాబాద్: మాదిగ జాతి మనుగడ, అభివృద్ధి కోసం రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు, మాదిగ ఉపకులాలు బీజేపీకి అండగా నిలువాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం సికింద్రాబాద్ బీదల బస్తీలో ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెస్‌ఎఫ్, అనుబంధ సంఘాల సికింద్రాబాద్ నియోజకవర్గం సన్నాహక సదస్సులో మంద కృష్ణ మాదిగ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధించుకోవడం ద్వారానే మాదిగల జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. గత 30 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రస్తుత కేంద్ర మంత్రిగా ఉన్న జి. కిషన్‌రెడ్డి తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొర్ర భిక్షపతి, ఇనుముల నర్సయ్య, కొమ్ము శేఖర్, నందారాం, సీతారాం పాల్గొన్నారు.

కళాసిల్క్ చేనేత హస్తకళా మేళా ప్రారంభం


వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

లాలాపేట: తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ప్రారంభమైన కళాసిల్క్ చేనేత హస్తకళా మేళాకు స్పందన వస్తోందని నిర్వాహకులు వికాస్ జైన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత హస్త కళాకారులు తమ సొంత మగ్గాలపై తయారు చేసిన వస్త్రాలు, పట్టు చీరలు మంగళగిరి పట్టు సారీస్ స్పెషల్ కలెక్షన్, బ్లాక్ ప్రింట్ సిల్క్ సారీలతో పాటు ఇంటికి అవసరమయ్యే కళాఖండాలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 31 వరకు ఈ మేళా కొనసాగుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'బీజేపీని ఓడించడమే లక్ష్యం కావాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యంగా అన్ని శక్తులు ఏకమై పని చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకుడు కె.జి.రామచందర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక టీఎస్‌డీఎఫ్ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు ప్రజలను దారిమళ్లించే కుట్రలు చేసిందన్నారు. అందులో భాగమే రాజ్యంలోకి మతాన్ని జోడించారని విమర్శించారు. ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, న్యూ డెమోక్రసీ నాయకులు జె.వి.చలపతిరావు, కె.గోవర్ధన్, సీపీఐ నేత బాలమల్లేష్, ఎంసీపీఐ నాయకులు గాదగోని రవి, మురహరి, కృష్ణప్రసాద్, ప్రసాదన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు.

రోగి సంరక్షణే మొదటి ప్రాధాన్యం


ఓపెన్ హౌస్ కార్యక్రమంలో వైద్యబృందం

సనత్‌నగర్: ఆస్పత్రికి వచ్చే రోగుల ఆరోగ్య సంరక్షణే మొదటి ప్రాధాన్యంగా ఆధునిక సౌకర్యాలతో బేగంపేటలో కిమ్స్ సైన్‌షైన్ హాస్పిటల్ మల్టీ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని చైర్మన్ భాస్కర్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ గురువారెడ్డి తెలిపారు. ఆదివారం ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్ కిమ్స్–సన్‌షైన్ ప్యారడైజ్ వద్ద నుంచి బేగంపేట ప్రధాన రహదారి పక్కన 12 అంతస్తుల భవనంలోకి మారిన సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. డాక్టర్ గురువారెడ్డి నేతృత్వంలో కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్‌ను మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా బేగంపేటలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నుంచి మొదలుకొని కార్డియాక్, గైనకాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, పల్మనాలజీ అన్ని రకాల సేవలను అందుబాటులో తీసుకువచ్చామన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


మహిళా దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న జడ్జి సూరేపల్లి నంద


మహిళలకు బహుమతులు అందజేస్తున్న సంఘం నాయకులు


మాట్లాడుతున్న శారదా ముదిరాజ్

లాలాపేట: తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తార్నాకలోని వంజరి భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వంజరి మహిళా సదస్సుకు జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కస్తూరి పాల్గొని మాట్లాడారు. నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. వంజరి సంఘం ఆధ్వర్యంలో మహిళా అభ్యున్నతికి చేస్తున్న కార్యక్రమాలను నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయా రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పలువురి మహిళలను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వంజరి సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం,కోశాధికారి కాలేరు అమరేందర్, సాల్వేరు ముత్యాలు, కరిపె ప్రవీన్, మహిళా కమిటీ సభ్యులు బెండె అనురాధ, బొగ్గుల సునీత, దాత్రిక సాయి రజనీ,ఆరె గీత, సాల్వేరు దేవిక,నీలి విజయలక్ష్మి, శోభ పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో..

రసూల్‌పురా: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా ఆదివారం రాష్ట్రపతి నిలయంలో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య వేడుకల్లో రాష్ట్ర నలుమూలల నుంచి రెండు వందల మంది కవయిత్రులు హాజరై సంస్కృతం నుంచి ఉర్దూ భాషా వరకు 70 మంది, తెలుగులో 150 మంది కవయిత్రులు కవిత పఠనం చేశారు. మూడు తరాల కవయిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళా అభ్యుదయం అంశంపై తమ భావాలు, మహిళా సాధికారత, రిజర్వేషన్లు, ఆర్థిక స్వావలంబన, సమభాగస్వామ్యంపై కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయ పరిపాలన అధికారి రజనీప్రియా పాల్గొన్నారు.

మహిళల పాత్ర కీలకం..

లాలాపేట: భారత స్వాతంత్ర్య పోరాటంలో కస్తూర్బా గాంధీ, సరోజినీ నాయుడు లాంటి ఎందరో మహిళామణులు వీరోచిత పోరాటాలు చేశారని హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద గుర్తు చేశారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నేటి మహిళలు క్రియాశీలక రాజకీయాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, సుబ్బలక్ష్మి, మంజుల, ఫాతిమా, అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ,శోభాకర్‌రావు,సుమన, నిరంజన్ బాబు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి..

పద్మారావునగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శారదా ముదిరాజ్ అన్నారు. బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవం, సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు శారదా ముదిరాజ్, సురేందర్, ఎం. శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సావిత్రీబాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని జాతి భవిష్యత్ కోసం శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు మాలతీ, న్యాయవాది శిరీష, వీణ, మంజుల, స్వర్ణలత, గీత, పద్మ, ఇందిరా పాల్గొన్నారు.


సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కవయిత్రులు